# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గయానా - భారత్ దేశాల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- ❖ సంక్లిష్టమైన అంతర్జాతీయ సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ విధానమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- ❖ డిజిటల్ రంగంలో ఆరోగ్యకరమైన అంశాలను తీసుకురావడమే లక్ష్యంగా వేవ్స్ ఓటీటీ పని చేస్తుందని ప్రసార భారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ తెలిపారు.
- ❖ కాగ్ అధిపతిగా ఐఏఎస్ అధికారి కె.సంజయ్ మూర్తి ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు.
- ❖ గోవాలో జరుగుతున్న 55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫ్ఫీ) కార్యక్రమాలలో భాగంగా ఈరోజు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రాలను ప్రదర్శించారు.

==========================

గయానా - భారత్ దేశాల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. గయానా తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఆ దేశాధ్యక్షులు మహమ్మద్ ఇర్ఫాన్ నరేంద్ర మోదీకి అందించారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ.. ఈ అవార్డును కోట్లాది మంది భారతీయులకు అంకితం ఇస్తున్నట్లుగా తెలిపారు. గయానా భారత్ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు పటిష్టంగా ఉన్నాయని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

సంక్లిష్టమైన అంతర్జాతీయ సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ విధానమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. లావోస్ లోని వియంటియాన్ లో ఈ రోజు జరిగిన 11వ ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశంలో మాట్లాడుతూ... సరిహద్దు వివాదాల నుండి వాణిజ్య ఒప్పందాల వరకు అంతర్జాతీయ సవాళ్లకు శాంతియుత చర్చలే మార్గమని అన్నారు. దేశాలు ఒకరి దృక్పథాలను మరొకరు గౌరవించుకుంటూ నిర్మాణాత్మకంగా నిమగ్నమైనప్పుడే ప్రపంచ సమస్యలకు నిజమైన, దీర్ఘకాలిక పరిష్కారాలను సాధించగలమని భారత్ విశ్వసిస్తోందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అధిపతిగా ఐఎఎస్ అధికారి కె.సంజయ్ మూర్తి ఈ రోజు ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. సంజయ్ మూర్తి గతంలో విద్యాశాఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా పని చేశారు. హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి కె.సంజయ్ మూర్తిని కాగ్ అధిపతిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం మూడు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ మత్స్య రంగంలో సుస్థిర వృద్ధిని సాధిస్తామని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... చేపల ఉత్పత్తిలో సముద్ర చేపల కంటే ఇన్ ల్యాండ్ ఫిషింగ్ వాటా ఎక్కువగా ఉందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

డిజిటల్ రంగంలో ఆరోగ్యకరమైన అంశాలను తీసుకురావడమే లక్ష్యంగా వేవ్స్ పేరుతో ప్రసార భారతి కొత్త ఓటీటీ వేదికను ప్రారంభించిందని ప్రసార భారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ అన్నారు. గోవాలో జరుగుతున్న 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో భాగంగా వేవ్స్ ఓటీటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. పిల్లలు, యువతతో సహా సమాజంలోని అన్ని వర్గాలకు మంచి అంశాలను అందించడం వేవ్స్ ఓటీటీ లక్ష్యమన్నారు. దూరదర్శన్ కార్యక్రమాలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు వేవ్స్ ఓటీటీలో పొందుపరుస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గోవాలో జరుగుతున్న 55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫ్ఫీ) కార్యక్రమాలలో భాగంగా రెండవ రోజు అయిన ఈ రోజు అనేక జాతీయ అంతర్జాతీయ చలన చిత్రాలను ప్రదర్శించారు. ఇఫ్ఫీ వేదిక పైన భారతీయ సినిమాలకు

సంబంధించి అత్యుత్తమ చిత్రాలను ప్రదర్శిస్తూ.. ఆహుతులను అలరించారు. వివిధ విభాగాలకు చెందిన నలభైకి పైగా చలన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ రోజు ప్రారంభమైన ఇండియన్ పనోరమా విభాగంలో ఎంపిక చేసిన 25 ఫీచర్ ఫిల్మ్స్, 20 నాన్-ఫీచర్ ఫిల్మ్స్ చిత్రాలను ప్రదర్శించారు. ప్రఖ్యాత సినీ ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు ప్యానెల్ చర్చల ద్వారా భారతీయ అంతర్జాతీయ చలన చిత్రాల గురించి సమీక్షించారు. దీనితో పాటు ఫిల్మ్ బజార్ 18వ ఎడిషన్ కూడా చలన చిత్ర ప్రముఖులతో కనిపించింది. ఔత్సాహిక చిత్రనిర్మాతలు పరిశ్రమ నిపుణులకు మధ్య సహకారానికి ఫిల్మ్ బజార్ కేంద్రంగా పనిచేస్తుందని ఇఫ్ఫీ నిర్వాహకులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మతపరమైన పర్యాటకానికి ఊతమిచ్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం మెరుగైన రహదారుల అనుసంధానాన్ని కల్పిస్తోందని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. 3,700 కోట్ల రూపాయల విలువైన ఆరు జాతీయ రహదారి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన సందర్భంగా గయలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.... బుద్ధ సర్క్యూట్ ను నాలుగు, ఆరు వరుసల రహదారులతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం రామ్-జానకి సర్క్యూట్ ను అభివృద్ధి చేస్తోందని అన్నారు. అలాగే, ఉత్తరాఖండ్ లోని పితోర్ గఢ్ మీదుగా మానస సరోవరానికి యాత్రికుల కోసం రహదారుల మంత్రిత్వ శాఖ ప్రత్యామ్నాయ రహదారి మార్గాన్ని అభివృద్ధి చేసిందని కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమగ్ర క్రీడా బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెడతామని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. బీహార్ రాజధాని పాట్నాలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఈ బిల్లు క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడానికి దోహదపడుతుందన్నారు. అదే విధంగా క్రీడారంగంలో దేశం ఉన్నత లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, 2036లో భారత్ ఒలింపిక్స్ కు ఆతిథ్యం ఇస్తుందని కేంద్రమంత్రి ప్రకటించారు. ప్రపంచంలో అగ్రశ్రేణి క్రీడాకారుల జాబితాలో భారత్ చోటు దక్కాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. దేశంలో క్రీడల అభివృద్ధి కోసం అన్ని క్రీడా సమాఖ్యలు ఐక్యంగా ఉండాలని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పేద విద్యార్థుల్లో విద్య, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ ఇనిషియేటివ్ ఫర్ స్టూడెంట్ ఇన్నోవేషన్ అండ్ ఔట్ రీచ్ నెట్ వర్క్ (విజన్) కార్యక్రమాన్ని రూపొందించామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో విజన్ ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి తగిన శిక్షణ అందించేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించబడినదని అన్నారు. అదే విధంగా పేద యువతకు సైతం స్టార్టప్ నైపుణ్యాలను అందుబాటులోకి తేవడానికి విజన్ దోహదపడుతుందని కేంద్రమంత్రి అన్నారు. 2047 నాటికి భారత దేశం లక్ష్యాలను సాకారం చేయడంలో విజన్ వంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా, ఉక్రెయిన్ల మధ్య తాజా ఘర్షణల నేపథ్యంలో ఈరోజు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,578 వద్ద లాభాల్లో ప్రారంభమై 77,155 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 23,349 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరింత క్షీణించి 84.49కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 2,671 వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిష్టాత్మకమైన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ 2024 ఆస్ట్రేలియాలో రేపటినుండి ప్రారంభం కానుంది. ఈ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా -భారత్ జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ పెర్త్ స్టేడియం వేదికగా రేపు జరగనుంది. భారత జట్టుకు జస్ప్రీత్ భుమ్రా నాయకత్వం వహించనున్నాడు. భారత కాలమానం ప్రకారం రేపు ఉదయం 7 గంటల 50 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది.

==========================

==========================